క్లుప్తంగా

క్షయ వ్యాధిపై అవగాహన



వేతనదారులకు అవగాహన కల్పిస్తున్న టీబీ సూపర్‌వైజర్ నరేష్

సాలూరు: మండలంలోని నెలిపర్తి గ్రామంలో ఉపాధి పనులు జరిగే ప్రదేశంలో క్షయ వ్యాధి నివారణపై వేతనదారులకు శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా టీబీ సూపర్‌వైజర్ నరేష్ మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు, తీవ్రజ్వరం, బరువు తగ్గడం, ఆకలి మందగించడం వంటి లక్షణాలు ఉంటే దానిని క్షయ వ్యాధిగా భావించి, వైద్యులను సంప్రదించి, కఫం పరీక్ష చేయించుకోవాలని సూచించారు. వ్యాధి నిర్ధారణ అయితే వైద్యులు సూచనల మేరకు తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు.

పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు



సుభద్ర గ్రామంలో పశువులకు టీకాలు వేస్తున్న మండల పశువైద్యాధికారి గణేష్

బలిజిపేట: మండలంలోని సుభద్ర గ్రామంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు శనివారం వేశారు. తీవ్రజ్వరం, మేత తీసుకోకపోవడం, పాల ఉత్పత్తి తగ్గిపోవడం, నోటివెంట చొంగకారడం, నాలుకపై బొబ్బర్లు, కాలు గిత్తల మధ్య పుండ్లు వంటివి వ్యాధి లక్షణాలని, ఈ వ్యాధి రాకుండా ముందస్తు జాగ్రత్త చర్యగా టీకాలు వేస్తున్నామని మండల పశువైద్యాధికారి గణేష్ తెలిపారు. ప్రతీ గ్రామంలోని పశువులకు ఈ టీకాలు వేయడం జరుగుతుందని, పాడిరైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఓటరు స్లిప్పుల పంపిణీని వేగవంతం చేయండి



ఓటరు స్లిప్పులు పరిశీలిస్తున్న తహసీల్దార్ రమణ

సీతానగరం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు స్లిప్పుల పంపిణీని వేగవంతం చేయాలని తహసీల్దార్ ఎన్వీ రమణ సూచించారు. శనివారం మండలంలోని వెంకటాపురం, నిడగల్లు, సూరంపేట, గుచ్చిమి, పాపమ్మవలస గ్రామాల్లో జరుగుతున్న ఓటరు స్లిప్పుల పంపిణీపై ఆరాతీశారు. ఎంతమంది ఓటర్లు ఉన్నారు, ఎంతమందికి ఇప్పటివరకు స్లిప్పులు అందించారన్నారు. ఈ మేరకు బీఎల్‌ఓలు ఓటరు నుంచి సేకరించిన తిరుగు రసీదులను తహసీల్దార్‌కు చూపించారు. ఈ నెల 13వ తేదీన పోలింగ్ జరగనున్నందున ప్రతీ ఓటరుకు ఓటరు స్లిప్పు చేరాలన్నారు.

నేత్ర శస్త్రచికిత్సకు 8 మంది ఎంపిక

సీతానగరం: మండలంలోని నీలకంఠాపురం గ్రామంలో శనివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా శిబిరానికి హాజరైన కంటి రోగులను పుష్పగిరి కంటి ఆస్పత్రి వైద్యుడు శ్రీరామ్ పరీక్షించి, 8 మందిని నేత్ర శస్త్రచికిత్సకు ఎంపిక చేశారు.

రేపు ఉచిత కంటి వైద్యశిబిరం

వీరఘట్టం: స్థానిక సత్యసాయి సేవా సమితిలో ఈనెల 6న ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు సమితి కన్వీనర్ పూణ్ణ విశ్వప్రసాద్, ప్రగతి సేవా సొసైటీ అధ్యక్షుడు పైల హరిబాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు పథకం కింద విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్, నవజీవన్ తిరుపతి ఆధ్వర్యంలో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు వైద్య పరీక్షలు కొనసాగుతాయని తెలిపారు. కంటి వ్యాధులతో బాధపడేవారంతా ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

సీతంపేట: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో స్వల్పకాలిక కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ టీవీ గిరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పీఎంకేవీవై 4.0 ఆధ్వర్యంలో స్కిల్ హబ్ ఇనీషియేటివ్ కార్యక్రమం ద్వారా ఎలక్ట్రీషియన్, పోర్‌వీలర్ సర్వీస్, ప్లంబింగ్, సూయింగ్ మిషన్ ఆపరేటింగ్ తదితర కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నట్లు వెల్లడించారు. పదో తరగతి పాస్, ఫెయిల్ అయిన విద్యార్థులు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులుగా పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు 2 పాస్‌పోటోలు, బ్యాంక్ పాస్‌బుక్ జిరాక్స్ కాపీలతో స్కిల్ హబ్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మరిన్న వివరాలకు 6304033963, 9948582309 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా ప్రచారం

వైఎస్సార్ సీపీ బలపరిచిన ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా పార్టీ నేతలు పలువురు శనివారం విస్తృత ప్రచారం నిర్వహించారు. పట్టభద్రులైన ఓటర్ల ఇంటింటికీ వెళ్లి, మొదటి ప్రాధాన్యతా ఓటు సుధాకర్‌కు వేసి, భారీ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. మరికొంతమంది వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తూ, కరపత్రాలు పంపిణీ చేస్తూ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేస్తున్నారు. విశాఖ రాజధాని కావాలన్న ఉత్తరాంధ్రుల బలమైన ఆకాంక్షను ఆయన గెలుపు ద్వారా చాటాలని పిలుపునిస్తున్నారు. ఈ నెల 13న జరిగే పోలింగ్‌లో ఓటర్లంతా పాల్గొని, ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

–సాక్షి నెట్‌వర్క్



సాలూరు: మామిడిపల్లిలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర



సాలూరులో సుధాకర్‌కు ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ దీప్తి



పార్వతీపురం టౌన్: వాసవి కళాశాలలో ప్రచారం చేస్తున్న ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్



పార్వతీపురం టౌన్: పట్టణంలో సుధాకర్‌కు మద్దతుగా ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే జోగారావు



సీతానగరం: అంటిపేటలో సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యతా ఓటు వేయాలని కోరుతున్న వ్యవసాయ సలహా కమిటీ జిల్లా చైర్మన్ నాగేశ్వరరావు



బలిజిపేట: నారాయణపురంలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు మురళీకృష్ణ, రవికుమార్ తదితరులు



సీతానగరం: వెంకటాపురంలో సుధాకర్‌కు ఓటు వేయాలని కోరుతున్న పార్టీ నాయకులు గౌరునాయుడు, గోపాలనాయుడు

సుధాకర్ గెలుపుతో విశాఖ రాజధాని ఆకాంక్షను చాటుదాం

● డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

సాలూరు: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా వైఎస్సార్ సీపీ బలపరిచిన సీతంరాజు సుధాకర్‌ను గెలిపించి, విశాఖ రాజధాని కావాలన్న ఆకాంక్షను బలంగా చాటుదామని డిప్యూటీ సీఎం, రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర పిలుపునిచ్చారు. శనివారం స్థానిక పట్టణంలోని ఆయన స్వగృహంలో పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు మీసాల నీలకంఠంనాయుడుతో కలిసి మాట్లాడిన ఆయన సుధాకర్ గెలుపు కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. విశాఖపట్నంలో జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ విజయవంతమైందని, ఎంతోమంది పెట్టుబడిదారులు విశాఖలో పరిశ్రమలు నెలకొల్పేందుకు ముందుకు రావడం శుభపరిణామమన్నారు. విశాఖ రాజధాని అయితే ఉత్తరాంధ్రుల ప్రగతి పరుగులు పెడుతుందన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ బలపరిచిన అభ్యర్థుల గెలుపు ద్వారా 2024 ఎన్నికల్లో పార్టీ గెలుపు అవకాశాలకు బలం చేకూర్చాలన్నారు. దీనికోసం ప్రతీ కార్యకర్త, నాయకుడు, అభిమానులు, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులంతా సమన్వయంతో పనిచేయాలన్నారు. ఇంటింటికీ వెళ్లి, నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న మంచి పనులు వివరించి, పార్టీ మద్దతు అభ్యర్థులకే ఓటు వేసేలా ప్రజలను చైతన్యం చేయాలని కోరారు.

పార్వతీపురంలో 'నో యాక్సిడెంట్ డే'



వాహనదారులకు సూచనలిస్తున్న ట్రాఫిక్ ఎస్‌ఐ పాపారావు

పార్వతీపురం టౌన్: పట్టణంలోని వైఎస్సార్ కూడలి వద్ద నో యాక్సిడెంట్ డే కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్‌ఐ పాపారావు అటువైపుగా వచ్చే వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ప్రతిఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించి, ప్రమాదాల నివారణకు సహకరించాలని కోరారు. వాహనాలతో బయటకు వచ్చేటప్పుడు సంబంధిత ధ్రువపత్రాలు వెంట తీసుకురావాలని, ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులంతా తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్లలో వచ్చే వారు సీటుబెల్టు పెట్టుకోవాలని, సెల్‌ఫోన్ మాట్లాడుతూ, మద్యం తాగి వాహనాలు నడపరాదన్నారు. అలాగే రోడ్ల పక్కన ఉండే ట్రాఫిక్ సంకేతాలు, సూచనలు తు.చ తప్పకుండా పాటించాలన్నారు.

సస్యరక్షణతో అధిక దిగుబడి

గరుగుబిల్లి: సస్యరక్షణ చర్యలతోనే వేరుశనగలో అధిక దిగుబడులు సాధించొచ్చని వ్యవసాయాధికారి ఆర్.విజయభారతి అన్నారు. శనివారం ఆమె మాట్లాడుతూ వేరుశనగ పంటలో వేరుకుళ్లు, టిక్కామచ్చ తెగులు గుర్తించామన్నారు. వేరుకుళ్లు నివారణకు బ్లెటాక్స్ 3 గ్రాముల మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. అలాగే టిక్కామచ్చ తెగులు నివారణకు మాంకోజెబ్ 3 గ్రాముల మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. పంటలకు తెగుళ్లు సోకినపుడు వ్యవసాయాధికారుల సలహాల మేరకు రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు.



శివ్వాంలో సాగుచేస్తున్న వేరుశనగపంట

ఎన్నికల నిబంధనలు పాటించాలి



రాజకీయ పార్టీల నాయకులతో మాట్లాడుతున్న తహసీల్దార్ రాములమ్మ

గుమ్మలక్ష్మీపురం: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలని తహసీల్దార్ జె.రాములమ్మ అన్నారు. శనివారం తన కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ప్రచార సమయంలో, పోలింగ్ రోజున ఎటువంటి చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడకూడదని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. సమావేశంలో ఎంపీడీఓ ఎస్.సాల్మన్‌రాజు, ఎల్విన్‌పేట పోలీసులు పాల్గొన్నారు.

మహిళలు చైతన్యవంతులు కావాలి



మాట్లాడుతున్న ఐద్వా నాయకులు

పాలకొండ రూరల్: నేటి సమాజంలో మహిళలు చైతన్యంతో మెలగాలని ఐద్వా నాయకురాలు గోరు పద్మ అన్నారు. మండలంలోని బుక్కా గ్రామంలో శనివారం అంగన్‌వాడీ, సచివాలయ మహిళా పోలీస్, క్షేత్రస్థాయి వైద్య సిబ్బంది సమన్వయంతో స్థానిక మహిళలతో సమావేశం నిర్వహించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో భాగంగా మహిళల రక్షణకు నిర్దేశించిన చట్టాలపై వారికి అవగాహన కల్పించారు. సమాజంలో స్త్రీలు, ఆడపిల్లలపై జరుగుతున్న అఘాయిత్యాలను అరికట్టేందుకు మహిళలు ధైర్యంగా ముందడుగు వేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘ నాయకులు ఎన్.హిమప్రభ, బి.అమరవేణి, ఎ.పద్మ, బి.జయంతి, ఎస్.కమలాజోష్, టి.దివ్య, పి.రామలక్ష్మి, ఇందిర తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో 62 రకాల మందులు

పార్వతీపురంటౌన్: గ్రామీణుల ఆరోగ్యమే ప్రధాన లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా ఎన్నో రకాల వైద్యసేవలు, 62 రకాల మందులను అందుబాటులో ఉన్నాయని వైద్యాధికారి తిరుమల ప్రసాద్ తెలిపారు. శనివారం మండలంలోని అడ్డాపుశీల గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించి, పలువురు చిన్నారులకు వైద్యపరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. మంచాన పడిన ఎంతోమంది రోగులకు ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా మెరుగైన వైద్యం అందుతోందన్నారు. నెలకు రెండు సార్లు నిర్వహించే ఈ కార్యక్రమానికి రోగులు హాజరై, వైద్య పరీక్షలు చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు, సీహెచ్‌ఓలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన సంతోషిమాత ఉత్సవాలు

భామిని: ఆంధ్రా–ఒడిశా సరిహద్దు బత్తిలిలో వెలసిన సంతోషిమాత ఆలయ 37వ వార్షికోత్సవాలు శనివారంతో ముగిశాయి. ఐదు రోజులుగా ఆలయ ప్రధాన అర్చకులు రంపా తాతబాబు శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి భక్తులు విశేష పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు కుటుంబంతో కలిసి పూర్ణాహుతి, హోమాదికాలు జరిపించారు. ఉత్సవాల సందర్భంగా ఐదు రోజులు అన్నసమారాధన చేశారు.

రూ.50వేలు విరాళం అందజేత

కొమరాడ: మండలంలోని కొట్టు గ్రామంలో శివాలయం పునర్నిర్మాణం కోసం మాదలింగి గ్రామానికి చెందిన క్వీన్స్ ఎన్‌ఆర్‌ఐ హాస్పిటల్ సీఈఓ తుమరాడ చంద్రమౌళీశ్వరావు రూ.50 వేలు విరాళం అందజేశారు. ఈ మొత్తాన్ని శనివారం మాదలింగి యూత్ సభ్యులు రాగాల సంతోష్, శిష్టు మోహనరావు, కొమ్మ వెంకటరమణ గ్రామస్తులకు అందజేశారు. ఆలయ పునర్నిర్మాణానికి దాతలు సహకరించాలని కోరారు.

7న డోలో యాత్ర

కురుపాం: ఈ నెల 7,8వ తేదీల్లో కురుపాం మండల కేంద్రంలోని శివ్వన్నపేట జగన్నాథస్వామి ఆలయం ఆవరణలో డోలో యాత్ర మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మంగళవారం, బుధవారం రెండు రోజుల్లో ఉదయం నుండి రాత్రి పది గంటల వరకు ప్రత్యేక పూజలతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించాలని కోరారు.

7 నుంచి ఆశీర్వాద పండుగలు

గుమ్మలక్ష్మీపురం: ఈనెల 7,8వ తేదీల్లో మండలంలోని చినగీసాడ గ్రామంలో నిత్యజీవ ఆశీర్వాద పండుగలు నిర్వహించనున్నట్లు విశ్వవాణి పాస్టర్ కె.భీముడు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పండుగలకు విశాఖపట్నం నుంచి రెవరెన్ పాస్టర్ ఇ.సామ్యూల్, హైదరాబాద్ నుంచి రెవరెన్ పాస్టర్ జి.గాబ్రియేల్, గుంటూరు నుంచి పాస్టర్ కె.పారయ్యనాయుడు, బొబ్బిలి నుంచి రెవరెన్ పాస్టర్ కె.జె.సునీల్ ముఖ్య అతిథులుగా పాల్గొని క్రీస్తు వ్యాక్యాన్ని బోధిస్తారన్నారు. క్రీస్తు భక్తులంతా ఈ ఉత్సవాల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

డయాలసిస్ రోగికి ఆర్థిక సాయం

భామిని: మండలంలోని బాలేరుకు చెందిన బుర్రా రమణకు రెండు కిడ్నీలు పాడవడంతో అతను మంచంపట్టాడు. కుటుంబ పోషణ కష్టంగా మారింది. ఈ నేపథ్యంలో గ్రామానికి చెందిన కళింగ వైశ్యసంఘం యూత్ కన్వీనర్ బోగి అరుణ్‌కిరణ్ తన మిత్రుల నుంచి విరాళాలు సేకరించి, ఆ మొత్తాన్ని శనివారం గ్రామ పెద్దల సమక్షంలో బాధితుడికి అందజేశారు. దాతలు ముందుకొచ్చి రమణ కుటుంబాన్ని ఆదుకోవాలని వాట్సాప్ గ్రూపుల్లో ప్రచారం చేయడంతో మరికొంతమంది యువత సాయం అందించినట్లు అరుణ్‌కిరణ్ తెలిపారు.

పేదలకు చీరల పంపిణీ

పాలకొండ: పట్టణంలోని శివ జ్యోతి టైలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం పేదలకు చీరలు పంపిణీ చేశారు. టైలర్స్ డే వేడుకల్లో భాగంగా స్థానిక బాలగోపాల లక్ష్మీనరసమ్మ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు వీటిని అందజేశారు. అసోసియేషన్ అధ్యక్షురాలు కె.కళ్యాణి, మహిళా టైలర్లు పాల్గొన్నారు.

2024 ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు

● ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురంటౌన్: 2024 ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా అందరూ పనిచేయాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు కోరారు. స్థానిక పట్టణంలో 11వ వార్డు సచివాలయం పరిధిలోని 22వ వార్డు కన్వీనర్లు, గృహసారథులు, కార్యకర్తలతో శనివారం సమావేశమైన ఆయన నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న పథకాలను ఇంటింటికీ వెళ్లి, వివరించాలన్నారు. ఈ నెల 18వ తేదీ నుంచి గృహసారథులంతా తప్పనిసరిగా ప్రతీ ఇంటికి వెళ్లి, ప్రభుత్వం చేస్తున్న మంచి పనిని తెలియజేయాలన్నారు. అలాగే ప్రతిపక్షాలు, ఎల్లో మీడియా ప్రభుత్వంపై చేస్తున్న దుష్ప్రచారం తిప్పికొట్టాలన్నారు. వాస్తవాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, పార్టీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, పార్టీ ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, పట్టణ జేసీఎస్ కన్వీనర్ గొర్లి మాధవరావు, ఏఎంసీ వైస్ చైర్మన్ వానపల్లి శంకరరావు పాల్గొన్నారు.

'ఫ్యామిలీ డాక్టర్'తో ఇంటింటికీ వైద్యసేవలు



సార్వత్రిక టీకాలు వేయడంపై అవగాహన కల్పిస్తున్న డీఐఓ టి.జగన్‌మోహన్‌రావు

● డీఐఓ టి.జగన్‌మోహన్‌రావు

సీతానగరం: ప్రజారోగ్యమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా ఇంటింటికీ వైద్య సేవలు అందించడం జరుగుతోందని డీఐఓ(జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి) టి.జగన్‌మోహన్‌రావు అన్నారు. శనివారం మండలంలోని మరిపివలస, ఇప్పలవలస, చెల్లన్నాయుడువలస, కృష్ణారాయపురం గ్రామాల్లో నిర్వహించిన సార్వత్రిక టీకాల వ్యాక్సినేషన్‌ను పరిశీలించిన ఆయన గడువులోగా చిన్నారులకు వ్యాక్సిన్లు వేయాలని వైద్య సిబ్బందికి సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు క్రమం తప్పకుండా అందేలా చూడాలన్నారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా ఎన్నో రకాల వైద్య సేవలు అందించడం జరుగుతోందని, ముఖ్యంగా ఈ కార్యక్రమం దీర్ఘకాల వ్యాధులతో ఇంటి వద్దనే చికిత్స పొందుతున్న వారికి ఎంతో ఉపయోగకరమన్నారు. ప్రతిఒక్కరూ ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం సద్వినియోగం చేసుకుని, ఆరోగ్యవంతులుగా ఉండాలని ఆకాంక్షించారు.

నష్టపోయిన ప్రతీ రైతుకు పరిహారం అందజేస్తాం



మాట్లాడుతున్న తహసీల్దార్ సత్యనారాయణ, పక్కన డీఆర్‌ఓ రవిబాబు

వీరఘట్టం: ఏనుగుల సంచారంతో పంటలు నష్టపోయిన ప్రతీ రైతుకు పరిహారం అందజేస్తామని తహసీల్దార్ చందక సత్యనారాయణ అన్నారు. శనివారం కిమ్మి గ్రామంలో ఫారెస్టు అధికారులతో కలిసి రైతులతో సమావేశం నిర్వహించారు. రైతుల సహకారంతో రెవెన్యూ, ఫారెస్టు అధికారుల సమన్వయంతో పంట నష్టాలను పరిశీలిస్తామన్నారు. ఈ నివేదికను అటవీశాఖ అధికారుల ద్వారా ప్రభుత్వానికి నివేదించి పరిహారం అందేలా చేస్తామన్నారు. డీఆర్‌ఓ రవిబాబు మాట్లాడుతూ ప్రస్తుతం కిమ్మి–నడుకూరు సమీప పంట పొలాల్లో తిష్ట వేసిన ఏనుగుల్లో ఒక ఏనుగు ప్రసవించిందని, కాబట్టి ప్రజలు, రైతులు వాటి సమీపంలోకి వెళ్లొద్దని కోరారు. వాటి దగ్గరకు వెళ్లడం, సెల్ఫీలు తీసుకోవడం వంటి రెచ్చగొట్టే పనులతో అవి భయాందోళనకు గురై దాడి చేసే ప్రమాదం ఉందన్నారు. ఈ విషయాన్ని ప్రజలందరూ గమనించాలని కోరారు.

సర్కారు బడులను ప్రగతిపథంలో నిలపాలి

● డిప్యూటీ విద్యాశాఖ అధికారి విజయకుమారి



రేగులపాడు కేజీబీవీలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఉప విద్యాశాఖ అధికారి విజయకుమారి

వీరఘట్టం: సర్కారు బడులను ప్రగతి పథంలో నిలపాలని పాలకొండ ఉప విద్యాశాఖ అధికారి ఆర్.విజయకుమారి సూచించారు. శనివారం మండల వ్యాప్తంగా అన్ని పాఠశాలలో తనిఖీలు చేపట్టారు. రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా పలు పాఠశాలలు తనిఖీ చేయగా, కొన్ని లోపాలు కనిపించాయని, ఆ లోపాలను సరిచేసుకోవాలని ఇదివరకు అన్ని పాఠశాలలకు సూచించడం జరిగిందన్నారు. ఎంతవరకు వాటిని సరిచేసుకున్నారో పరిశీలించేందుకే అన్ని పాఠశాలలను ఏక కాలంలో తనిఖీ చేయడం జరిగిందన్నారు. వీరఘట్టం మండలంలోని హైస్కూల్ హెచ్‌ఎంలు 9 బృందాలుగా ఏర్పడి, ఒక్కో బృందం 5 పాఠశాలలను తనిఖీ చేసినట్లు చెప్పారు. ముఖ్యంగా బైజూస్ యాప్ వినియోగం, విద్యార్థుల వర్క్ బుక్స్, నోట్ బుక్స్‌తో పాటు ఉపాధ్యాయుల లెసన్ ప్లాను, టీచింగ్ ప్లాను, టీచర్ డైరీలను పరిశీలించడం జరిగిందన్నారు. ఇంకా కొన్ని పాఠశాలల్లో చిన్నచిన్న లోపాలు ఉన్నాయని, వాటిని సరిచేసుకోవాలని సూచించినట్లు చెప్పారు.

పట్టభద్రులంతా ఓటుహక్కు వినియోగించుకోవాలి

వీరఘట్టం: పట్టభద్రుల ఓటరు జాబితాలో పేరున్న ప్రతి ఒక్కరూ ఈ నెల 13న జరిగే ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌లో పాల్గొని ఓటు హక్కు వినియోగించుకోవాలని తహసీల్దార్ చందక సత్యనారాయణ కోరారు. మండల వ్యాప్తంగా జరుగుతున్న ఓటరు స్లిప్పుల పంపిణీపై శనివారం ఆయన ఆరా తీశారు. బీఎల్‌ఓలు మాత్రమే ఓటరు స్లిప్పులు పంపిణీ చేయాలన్నారు. మండల వ్యాప్తంగా ఉన్న 1319 మంది పట్టభద్రులకు ఓటరు స్లిప్పులు పంపిణీ చేసినట్లు చెప్పారు. వీరఘట్టం బాలికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరుగుతుందన్నారు.